# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వ నిర్వహణలోకి తీసుకునేందుకు తెలంగాణ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

3. **ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ్యుల క్రీడా పోటీలు ఈ రోజు నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి.**

4. **ఇరాన్ దేశంలో ఉన్న ప్రవాసాంధ్రులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసే సూచనలను పాటించాలని ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.**

==========================

ప్రభుత్వ ప్రైవేట్ ప్రజల భాగస్వామ్యం–పీ4 కార్యక్రమం ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై శాసన సభలో ముఖ్యమంత్రి నిన్న ప్రసంగించారు. సామాజిక సమానత్వం లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా 10 లక్షల కుటుంబాలను లక్ష మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని ముఖ్యమంత్రి వివరిస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

-------------------------

ప్రభుత్వ సేవల్లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ సేవలను సులభతరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం లక్ష్యంగా ఉద్యోగుల పనితీరును నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా వైద్యుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి అన్ని స్థాయిల్లో సేవలు మెరుగుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.

-------------------------

హైదరాబాద్ మెట్రోను ప్రభుత్వ నిర్వహణలోకి తీసుకునేందుకు తెలంగాణ మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం నిన్న సమావేశమైంది. క్యాబినెట్ సమావేశ వివరాలను మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాత్రికేయులకు వెల్లడించారు. మార్చి 16 నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు 16న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారని, 20న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్ దారులకు ప్రమాద బీమా పథకం అమలు చేయనున్నామని మంత్రి వివరిస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని రాజమహేంద్రవరంలో కల్తీ పాల వల్ల అనారోగ్యం కారణంగా మూత్రపిండాల వైఫల్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ఆరోగ్య శాఖ కమిషనర్ జి. వీర పాండ్యన్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన నిన్న పరామర్శించారు. అనంతరం వీరపాండ్యన్ పాత్రికేయులతో మాట్లాడుతూ, పరిస్థితిని ప్రభుత్వం పూర్తిగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య బృందాలను నియమించి, బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన తెలియజేస్తూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈరోజు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. నిన్న ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కాగా, ఈరోజు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు మొదలవుతున్నాయి. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 1,537 పరీక్ష కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరుగుతుంది.

---------------------------

“ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ క్రీడలు-2026” ను ఈ రోజు నుంచి ఈ నెల 26వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ ఏ రవినాయుడు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై విజయవాడలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ రోజు మధ్యాహ్నం 3 గంటలకు శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు ఈ క్రీడా ఉత్సవాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, సహా మొత్తం 14 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నామని ఆయన వివరిస్తూ,

వాయిస్ .. 27 సెకన్లు

---------------------------

రైతులకు, వ్యాపారులకు పరిశ్రమలకు బ్యాంకులు సకాలంలో రుణాలు అందించి ఆర్థిక చేయూతనివ్వాలని

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు సూచించారు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఎస్.బి.ఐ బ్యాంక్ నూతన శాఖను ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి లావాదేవిని జరిపిన స్థానికులకు సంబంధిత పత్రాలను అందించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, బ్యాంకు ఏర్పాటు స్థానిక రైతులకు, పరిశ్రమలకు ఉపయుక్తంగా ఉంటుందని, స్థానికంగా వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయని తెలిపారు. రైతులకు లబ్ధి చేకూర్చే పథకాలపై స్థానికంగా విస్తృత ప్రచారం కల్పించాలని బ్యాంక్ అధికారులను కోరారు.

---------------------------

ఇరాన్ దేశంలో ఉన్న ప్రవాసాంధ్రులు ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీచేసే సూచనలను పాటించాలని ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. అందుబాటులో ఉన్న ప్రయాణమార్గాల ద్వారా వీలైనంత త్వరగా ఇరాన్ నుంచి స్వస్థలాలకు చేరుకోవాలని తెలుపుతూ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పాస్‌పోర్టులు, ఐడీ కార్డులు వంటి ఇతర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇరాన్‌లోని భారత రాయబారి కార్యాలయంతో, ఆంధ్ర ప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ –ఏపీఎన్ఆర్‌టీతో సంప్రదింపులు చేయాలన్నారు. సహాయం కోసం ఏపీఎన్ఆర్‌టీ కేంద్రం నంబర్ 8500027678ని సంప్రదించాలని సూచించారు.

---------------------------

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని దక్షిణ కోస్తా జిల్లాల్లో ఈ రోజు, రేపు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.

తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అల్పపీడనం ప్రభావంతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి.

====================